క్లుప్తంగా

ఇసుక కార్మికుడి అనుమానాస్పద మృతి


కర్రి రాంబాబు

ధవళేశ్వరం: స్థానిక గాయత్రి ర్యాంపు వద్ద ఇసుక కార్మికుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ధవళేశ్వరం వాడపేటకు చెందిన కర్రి రాంబాబు(40) శనివారం తెల్లవారుజామున ఇసుక కోసం నావలో గోదావరిలోకి వెళ్లాడు. నదిలో ఉండగా గుండెపోటు రావడంతో నీటిలో పడి మృతి చెందినట్లు సహ కార్మికులు తెలిపారు. మృతిపై పలు అనుమానాలు రావడంతో మృతదేహానికి శవ పంచనామా చేసి పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సీఐ టి.గణేష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా ఓబన్న జయంతి

సీటీఆర్ఐ: స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని శనివారం కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి మాట్లాడుతూ బ్రిటిష్ పాలకుల నిరంకుశ వైఖరి, అధిక పన్నుల వసూలు, గ్రామీణులను దోపిడీ చేయడం తదితర వాటిపై తిరగబడిన సంచార జాతుల కుటుంబానికి చెందిన యోధుడు వడ్డే ఓబన్న అన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ అధికారి కేఎస్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పోలవరానికి రూ.లక్ష కోట్లు కేటాయించాలి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): పోలవరం నిర్వాసితుల సమస్యలపై కూడా సమీక్షించాలని, ప్రాజెక్టు నిర్మాణానికి రూ.లక్ష కోట్లు కేటాయించాల్సిందిగా కేంద్ర ప్రభుత్వానికి నివేదించాలని ఆదివాసీ మహాసభ న్యాయ సలహాదారు అయినాపురపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టుపై ఏర్పాటైన పార్లమెంటరీ స్థాయీ సంఘానికి రాజమహేంద్రవరంలో శనివారం ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. హైకోర్టు ఆదేశాల మేరకు, 2014 కొత్త భూసేకరణ చట్టం ప్రకారం 276 ముంపు గ్రామాల ప్రజలకు పరిహారం చెల్లించాకే ఆర్‌అండ్‌ఆర్ కాలనీలకు తరలించాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఎస్సీ, ఎస్టీలకు రూ.11.66 లక్షలు, గిరిజనేతరులకు రూ.10.75 లక్షల చొప్పున చెల్లించాలని సూర్యనారాయణ కోరారు.

భోగిమంటల్లో విద్యుత్ బిల్లులు దహనం చేయాలి

ప్రకాశం నగర్: పెరిగిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా భోగిమంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేయాలని సీపీఎం పిలుపును ఇచ్చింది. స్థానిక శ్యామల సెంటర్ వద్ద ఉన్న పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలు పెంచబోమని కూటమి నాయకులు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారనన్నారు. కానీ ఇప్పుడు సర్దుబాటు చార్జీల పేరుతో జనంపై భారం మోపుతున్నారన్నారు. ఈ అదనపు చార్జీలను వ్యతిరేకిస్తూ బిల్లులను భోగిమంటల్లో కాల్చివేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి బి.పవన్, జిల్లా కమిటీ సభ్యులు ఐ.సుబ్రహ్మణ్యం, పోలిన వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి బాపూజీ నగర్ లోని సిద్ధూ ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో బీఎంపీ రూరల్ మండల శాఖ ఆధ్వర్యంలో వ్యవస్థాపక అధ్యక్షుడు శనివారం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కొమ్మా శ్రీనివాస్, ఆకాశం గౌరీష్ బాబు, ఎస్‌కే ఇమామ్, కన్నాబత్తుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

అనుకూలంగా కోర్టు తీర్పు

ధవళేశ్వరం: గ్రామంలోని ఎస్ఎంఈ చర్చి సంఘ కాపరిగా తనకు అనుకూలమైన తీర్పు వచ్చిందని గుర్రపు కిరణ్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో జరిగిన సంఘటనల నేపథ్యంలో కొందరు సంఘ సభ్యులు కోర్టును ఆశ్రయించారన్నారు. ఈ నేపథ్యంలో తీర్పు తనకు అనుకూలంగా వచ్చిందన్నారు.






అమ్మకానికి సిద్ధంగా ఉన్న సున్నుండలు, అరిసెలు, కజ్జికాయలు, జంతికలు

పండగ సందడి..



పిడకల దండలు



మార్కెట్‌లో రెడీగా ఉన్న గాలి పటాలు



వివిధ రకాల రంగులు

- మార్కెట్‌కు సంక్రాంతి కళ
- అందుబాటులో అన్ని వస్తువులు
- పిండి వంటల నుంచి రంగుల వరకూ లభ్యం
- అమ్మకానికి భోగి పిడకలు

ప్రకాశం నగర్: పెద్ద పండగగా పిలుచుకునే సంక్రాంతిని ఘనంగా జరుపుకొనేందుకు నగర వాసులు సమాయత్తమవుతున్నారు. సోమవారం నుంచి పండగలు ప్రారంభం కానున్నాయి. సంక్రాంతి అంటే సందడి, హడావుడి చాలా గొప్పగా ఉంటుంది. ఉద్యోగ, వ్యాపారాల రీత్యా ఎక్కడెక్కడో స్థిరపడిన వారందరూ సొంతూరికి విచ్చేస్తారు. కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులతో కలిసి సందడి చేస్తారు.

పిండి వంటలకు ప్రాధాన్యం

సంక్రాంతి అంటే భోగిమంటలు, గాలిపటాలు, కోడి పందేలు మాత్రమే కాదండోయ్. పండగ సమయంలో పిండి వంటలకు ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. గ్రామాల్లో దాదాపు నెల రోజుల ముందుగానే వీటిని వండడం ప్రారంభిస్తారు. పండగ సమయంలో వచ్చిన కుటుంబ సభ్యులు, అతిథులకు ఆప్యాయంగా అందిస్తారు. వీటిలో సున్నుండలు, అరిసెలు, జంతికలు, కజ్జికాయలు ప్రధానంగా ఉంటాయి.

అందుబాటులో..

పల్లెటూళ్లలో పిండి వంటలను తయారు చేసే తీరిక, తయారీ విధానం అక్కడి మహిళలు తెలిసి ఉంటుంది. వారందరూ చాలా రుచిగా, నాణ్యతగా వీటిని తయారు చేస్తారు. కానీ పట్నం వాసులకు మాత్రం తయారీ విధానం తెలియదు. ఇక్కడి ఉరుకులు పరుగుల జీవితంలో తీరక కూడా ఉండదు. అయితే ఇలాంటి వారి కోసం రాజమహేంద్రవరంలోని పలు స్వీట్ షాపుల్లో అన్ని రకాల పిండి వంటలు దొరుకుతున్నాయి. పండగ పూట అమ్మచేతితో తయారు చేసిన వంటకాల మాదిరి ఆకట్టుకుంటున్నాయి.

భలే గిరాకీ

నగరంలోని పలు స్వీట్ షాపుల్లో వివిధ రకాల పిండి వంటలను తయారు చేసి విక్రయిస్తున్నారు. అరిసెలు, కజ్జికాయలు, సున్నుండలు, జంతికలు వంటి వాటిని వినియోగదారుల ఆర్డర్ల మేరకు తయారు చేసి అందజేస్తున్నారు. కేజీల అరిసెలు రూ.240 నుంచి రూ.270 వరకూ, కజ్జికాయలు రూ.280 నుంచి రూ.300, సున్నుండలు రూ.370 నుంచి రూ.400 వరకూ, జంతికల ప్యాకెట్‌ను రూ.వంద వరకు విక్రయిస్తున్నారు. పండగ సీజన్ నేపథ్యంలో పిండి వంటకాలు అమ్మకాలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు.

మార్కెట్‌లో సందడి

సంక్రాంతికి కావాల్సిన అన్ని వస్తువులు మార్కెట్‌లో లభిస్తున్నాయి. ముగ్గుల రంగులు, భోగి పిడకలు, పతంగులు, పిండి వంటలు అందుబాటు ధరలో దొరుకుతున్నాయి. కంబాలచెరువు, జాంపేట, దేవీచౌక్, మెయిన్ రోడ్డు వంటి ప్రాంతాల్లో వీటిని విక్రయిస్తున్నారు. పిడకల దండ రూ.25 నుంచి రూ.30 వరకు విక్రయిస్తున్నారు. అలాగే వివిధ ఆకృతుల్లో తయారు చేసిన గాలి పటాలు చిన్నారులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. రూ.పది నుంచ రూ.300 వరకూ విక్రయాలు జరుగుతున్నాయి.

పిండి వంటలను బంధువులకు పంపిస్తాం

సంక్రాంతి పండగకు పిండి వంటలు తయారు చేసి, చుట్టుపక్కల వారికి బంధువులకు పంపడం ఆనవాయితీ వస్తోంది. ప్రస్తుతం అన్ని రకాల పిండి వంటలు షాపుల్లో అందుబాటు ధరలో దొరుకుతున్నాయి. వాటిని ఇంటిలో కష్టపడి తయారు చేయాల్సిన అవసరం లేదు. ముఖ్యమైన వాటిని ఇంట్లో తయారు చేసి, మిగిలిన వాటిని తయారు చేయించుకుని బంధువులకు, స్నేహితులకు పంచిపెడుతున్నాం. గతంలో తయారు చేయడానికి అవస్థలు పడేవారు. ఇప్పుడు ఆ అవసరం లేదు.

– దుర్గ, గృహిణి

తహసీల్దార్ పోసిబాబుకు పదోన్నతి



తహసీల్దార్ పోసిబాబును అభినందిస్తున్న ఉద్యోగులు

కడియం: తహసీల్దార్ కె.పోసిబాబుకు పదోన్నతి లభించింది. ఆయన చింతూరు రెవెన్యూ డివిజన్ ఆర్‌అండ్‌ఆర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయి. ఎన్నికల తరువాత సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన ఇక్కడకు వచ్చారు. ఇప్పుడు పదోన్నతిపై బదిలీ కానున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, సిబ్బంది ఆయనను అభినందించారు.

ముందే వచ్చిన సంక్రాంతి శోభ

- విద్యా సంస్థల్లో ఉత్సాహంగా సంబరాలు
- సందడి చేసిన విద్యార్థులు



సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న షిర్డీసాయి విద్యార్థులు



కవలగొయ్యిలోని ఫ్యూచర్ కిడ్స్ గ్లోబల్ స్కూల్లో సంక్రాంతి వేడుకలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సంక్రాంతి ముందస్తు సంబరాలను శనివారం పలు విద్యా సంస్థల్లో ఘనంగా నిర్వహించారు. రాజమహేంద్రవరం శ్రీషిర్డీ సాయి విద్యాసంస్థల ప్రాంగణం రంగవల్లులతో కళకళలాడింది. విద్యార్థులు సంప్రదాయ దుస్తులలో సందడి చేశారు. ప్రముఖ చర్మవ్యాధి నిపుణులు దీప్తి, ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ జ్యోతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత భోగిపండ్ల వేడుక నిర్వహించారు. విద్యార్థులు వివిధ వేషధారణలతో కనువిందు చేశారు. కుస్తీ, సంప్రదాయ కోడిపందేలు నిర్వహించారు. సంస్కృతి, సంప్రదాయాలను నేటి తరానికి తెలియచెప్పే ఉద్దేశంతో ఏటా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య తెలిపారు. తొలుత నాగమణి పాలేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైంది.

ఫ్యూచర్ కిడ్స్ గ్లోబల్ స్కూల్లో..

రాజమహేంద్రవరం రూరల్: కవలగొయ్యిలోని ఫ్యూచర్ కిడ్స్ గ్లోబల్ స్కూల్లో సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా జరిగాయి. మహా గణపతి నృత్యంతో మొదలైన కార్యక్రమం వివిధ రకాలైన నృత్య రూపకాలు, జానపద, శాస్త్రీయ, ఆధునిక నృత్యాలతో కొనసాగింది. పాఠశాల డైరెక్టర్ రవిబాబు యేలేటి, చైర్ పర్సన్ విజయ యేలేటి, సీఈవో రుద్రశ్రీ మహశ్వి యేలేటి, డీన్ హర్షిణి, ప్రిన్సిపాల్ శేషగిరిధర్ పాల్గొన్నారు.

సంహిత డిగ్రీ కళాశాలలో..

కంబాలచెరువు: తాడితోటలోని సంహిత డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ తోట రామకృష్ణుడు ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. కళాశాల ఏవో జి.బాలకృష్ణ అధ్యక్షతన ముగ్గుల పోటీలు, భోగి మంటలు వేశారు. విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసరావు, డీవీవీ సతీష్, కేవీ రాజేష్ అందజేశారు. కల్చరల్ హెడ్ పల్లి సురేష్, తెలుగు అమ్మాయి పేరిట నిర్వహించిన కార్యక్రమంలో గెలుపొందిన విద్యార్థిని హేమకు ప్రత్యేక బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు, లైబ్రేరియన్ కె.వీర్రాజు పాల్గొన్నారు.

సీటు కాదు.. చోటుంటే చాలు..

- పండగ నేపథ్యంలో పోటెత్తిన ప్రయాణికులు
- రైల్వే స్టేషన్, బస్టాండ్‌లో విపరీతమైన రద్దీ
- ప్రత్యేక సర్వీసులు తిప్పుతున్న అధికారులు



బస్ కాంప్లెక్స్‌లో వేచిఉన్న ప్రయాణికులు



రైల్వేస్టేషన్‌లో రద్దీ

రాజమహేంద్రవరం సిటీ: సంక్రాంతి సెలవులు ప్రారంభం కావడంతో రైల్వే స్టేషన్లు, ఆర్టీసీ బస్టాండ్లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. ఈ మేరకు శనివారం జిల్లాలోని పలు ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులతో రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్, బస్టాండ్‌లో విపరీతమైన రద్దీ నెలకొంది. జిల్లాలోని రాజమహేంద్రవరం, గోకవరం, నిడదవోలు, కొవ్వూరు ఆర్టీసీ డిపోల నుంచి రెగ్యులర్‌గా నడిచే 270 బస్సులతో పాటు 144 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. ఇవన్నీ ప్రయాణికులతో నిండిపోతున్నాయి. వారి రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులను 24 గంటలూ ఏర్పాటు చేస్తున్నామని డీపీటీఓ షర్మిల అశోక తెలిపారు. అలాగే రాజమహేంద్రవరం ప్రధాన రైల్వే స్టేషన్ ప్రయాణికుల రద్దీతో కిక్కిరిసిపోయింది. రిజర్వేషన్ బోగీలు సైతం అన్ రిజర్వ్‌డ్ ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. పండగ సందర్భంగా జిల్లా మీదుగా ప్రత్యేక రైళ్లు తిరుగుతున్నాయి. రైల్వే అధికారులు ఇప్పటికే చర్లపల్లి – విశాఖపట్నం మధ్య ప్రత్యేక రైళ్లను ప్రకటించారు. శనివారం నుంచి ఈ నెల 18వ తేదీ వరకు జిల్లా మీదుగా రాకపోకలు సాగించే విధంగా జనసాధారణ్ (అన్ రిజర్వుడు) రైళ్లు తిరగనున్నాయి. రాజమహేంద్రవరం మీదుగా నిత్యం 120 ప్రయాణికుల రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి.

జగనన్న కాలనీల పేరు మార్పు దుర్మార్గం



మాసా రామజోగ్

రాజమహేంద్రవరం సిటీ: మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేరుతో ఏర్పాటైన కాలనీల పేరు మార్పు చేసేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టడం దారుణమని వైఎస్సార్ సీపీ పార్లమెంట్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రామజోగ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరంలోని తన కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఒకేసారి 31 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు రూ.76 వేల కోట్లతో ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి, ప్రతీ ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు మంజూరు చేసిన ఘనత జగన్‌దన్నారు. జగనన్న కట్టిన కాలనీలలో చాలా మంది గృహ ప్రవేశాలు చేశారన్నారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలల తరువాత జగనన్న కాలనీల పేరు మార్పు చేసే విధంగా చర్యలు చేపట్టడం సిగ్గు చేటన్నారు.

ప్రజలను మభ్యపెట్టి గెలిచిన చంద్రబాబు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: ఎన్నికల సమయంలో ప్రజలను మభ్య పెట్టి చంద్రబాబు విజయం సాధించారని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. సచివాలయంలో పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగస్తుల గురించి మాత్రమే మాట్లాడి, రాష్ట్రంలోని 2.70 లక్షల మంది వలంటీర్ల గూర్చి మాట్లాడకపోవడం దారుణమన్నారు. వలంటీర్లకు రూ.5 వేలు బదులుగా రూ.10 వేలు ఇస్తామని ఎన్నికల సమయలో ప్రకటించారన్నారు. అధికారంలోకి వచ్చాక వారి గురించి మర్చిపోయారన్నారు. ఈ విషయంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని నిరుద్యోగులకు ఇస్తామని భృతి విషయం ఏమైందన్నారు. సంవత్సరానికి ఒక సిలిండర్ ఇచ్చి, ఇవే సూపర్ సిక్స్ అన్నట్టుగా కూటం ప్రభుత్వం పాలన ఉందన్నారు.

నర్సరీ రంగ సమస్యలపై వినతిపత్రం



కమిషనర్ ప్రభాత్ కుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న మల్లు పోలరాజు

కడియం: నర్సరీ రంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని నేషనల్ హార్టీకల్చర్ కమిషనర్ డాక్టర్ ప్రభాకుమార్‌కు సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లు పోలరాజు, పాలకవర్గ సభ్యులు వినతిపత్రం అందజేశారు. కడియపులంకలోని అసోసియేషన్ కార్యాలయం వద్దకు శనివారం విచ్చేసిన కమిషనర్‌కు సంబంధిత సమస్యలను విన్నవించారు. మట్టికి బదులుగా మీడియా తయారు చేసి మేలైన పద్ధతుల్లో నర్సరీ కల్టివేషన్ చేసే విధంగా ప్రభుత్వం ద్వారా శాస్త్రవేత్తలు మార్గదర్శకాలు చూపాలన్నారు. పోలీహౌస్‌లు, షేడ్ నెట్లు కేంద్ర ప్రభుత్వ రాయితీతో ఇప్పించాలన్నారు. సానుకూలంగా స్పందించిన ఆయన రైతులకు మేలు జరిగే విధంగా చూస్తామన్నారు. అనంతరం శివాంజనేయ నర్సరీని సందర్శించారు. ఫ్లోరికల్చర్ రీసెర్చ్ సెంటర్ శాస్త్రవేత్త డీవీఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర సంస్థ సేవలు ఆదర్శనీయం



స్వర్ణాంధ్ర డైరీని ఆవిష్కరిస్తున్న ఎల్ఐసీ అధికారి సంధ్యారాణి తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: పేదలకు, నిరాశ్రయులకు స్వర్ణాంధ్ర అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని జీవిత బీమా సంస్థ సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.సంధ్యారాణి ఆవిష్కరించారు. ఈ మేరకు శనివారం స్వర్ణాంధ్ర సేవా సంస్థ 2025 డైరీని ఆమె ఆవిష్కరించారు. ఎల్ఐసీ మోరంపూడి డివిజనల్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర ముఖ్య నిర్వాహకుడు గుబ్బల రాంబాబు, బృందంతో కలిపి ఈ కార్యక్రమం నిర్వహించారు. సంధ్యారాణి మాట్లాడుతూ ఎలాంటి ప్రభుత్వ నిధులు లేకుండా 27 సంవత్సరాలుగా సేవా సంస్థ నడపడం చాలా గొప్ప విషయం అన్నారు. నిర్వాహకుడు రాంబాబు జీవిత బీమా సంస్థ ఉద్యోగిగా, ఉద్యోగుల సంఘం నాయకుడిగా, సేవలందించి స్వచ్ఛంద పదవీ విరమణతో పూర్తి సమయం సమాజ సేవ కోసం అంకితమవడం గర్వకారణం అన్నారు. ఈ సందర్భంగా సంధ్యారాణిని స్వర్ణాంధ్ర పక్షాన సత్కరించారు. కార్యక్రమంలో స్వర్ణాంధ్ర ఉపాధ్యక్షుడు బత్తుల భరణీ తాతేశ్వర్, సహాయ కార్యదర్శి ఎలిపే శ్రీనివాస్, పులగుర్త సాయి బాబా, స్వర్ణాంధ్ర సిబ్బంది హరి ప్రసాద్ పాల్గొన్నారు.